అంబరాన్నంటిన జగనన్న జన్మదిన సంబరం



వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, అభిమానులు



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సంబరాలు శనివారం అంబరాన్నంటాయి. నగరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి, జగనన్న జన్మదినం పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఏడు నెలలవుతున్నా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. చంద్రబాబు పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. ప్రజల పక్షాన పోరాటాలకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ఏడు నెలల పాలనలో కరెంట్ చార్జీలు పెంచడం, ఇప్పుడు భూముల ధరలను పెంచడం సిగ్గుచేటన్నారు. నిత్యావసర సరకులు, వంట నూనెల ధరను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారంటే జగనన్న మీద ఉన్న అభిమానం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, పార్టీ సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, కేడీసీసీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, నాయకులు ఆలీఖాన్, గడ్డం రామక్రిష్ణ, బెల్లం మహేశ్వర రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మీకాంతా రెడ్డి, నాగలక్ష్మి రెడ్డి, ఆర్షియా ఫర్హీన్, షేక్ యూనుసు బాషా, మునెమ్మ, నాయకులు షరీఫ్, రాఘవేంద్ర నాయుడు, సువర్ణ రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దండి మార్చ్ విగ్రహం వద్ద..

స్థానిక బిర్లా గడ్డ వద్ద ఉన్న దండి మార్చ్ మహాత్ముల విగ్రహం వద్ద జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో అడ్డకూలీల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. అడ్డకూలీలకు చీరెలను పంపిణీ చేశారు.

అభయగిరి ఆశ్రమంలో..

నగర శివారులోని అభయగిరి ఆశ్రమంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేశారు. స్వెట్టర్లు పంపిణీ చేశారు.



అనాథ చిన్నారులతో కలసి కేక్ కట్ చేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

విజ్ఞాన్ పీఠంలో..

నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక ఉన్న విజ్ఞానపీఠం అనాథ ఆశ్రమంలో చిన్నారులకు పార్టీ యువజన విభాగం అధ్యక్షులు శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దాదాపు 200 మంది చిన్నారులకు బిర్యానీ వండించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షల ఫ్లెక్సీని ఆటోకు ఏర్పాటు చేసుకుని నగరంలో తిప్పుతూ అభిమానం చాటుకున్న డ్రైవర్ మద్దిలేటి

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, నాయకులు అచ్చిరెడ్డి, సాయి, ఇలియాస్ అహమ్మద్, దుర్గా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రజకుల అభివృద్ధికి చేయూత ఇవ్వండి



కలెక్టర్‌కు పూలబొకే అందజేస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

కర్నూలు(సెంట్రల్): రజకుల అభివృద్ధి కోసం విడుదల చేసిన 6, 27 జీఓలను అమలు చేసి చేయూత ఇవ్వాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కోరారు. శనివారం ఆమె కలెక్టర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి,పూలబొకే అందజేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ధోబీ పోస్టుల భర్తీకి, వృత్తి పరమైన శిక్షణ, ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మెప్మా ఆర్పీల ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి డిమాండ్ చేశారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మెప్మా ఆర్పీలకు జీతాలు చెల్లించకుండా కాలం వెల్లబుచ్చడం అన్యాయమన్నారు. ఆర్పీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. ఆర్పీలకు పెండింగ్ వేతనాలతో పాటు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అంజిబాబు, రుద్రమ్మ పాల్గొన్నారు.

ఏపీఎంసీఈయూ రాష్ట్ర కమిటీలో మునెప్ప



కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్(ఏపీఎంసీఈయూ, ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన ఎస్.మునెప్ప ఎన్నికయ్యారు. విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగిన యూనియన్ ఆరో రాష్ట మహాసభలో మునెప్పను ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం, కనీస వేతనాలు సాధించేందుకు, కాంట్రాక్టర్ల దోపిడీకి గురిగాకుండా వారిని ఆప్కాస్‌లో కలిపి భవిష్యత్ పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



పరిశుభ్రత పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: పర్యావరణాన్ని కాపాడుకోవడాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉమెన్స్ హాస్టల్స్ వద్ద పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ హాస్టళ్ల పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో పోరాట స్ఫూర్తి కనబరచాలి

- రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా



పోటీలను ప్రారంభిస్తున్న రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): క్రీడల్లో పోరాట స్ఫూర్తి ఎంతో అవసరమని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిందన్నారు. క్రీడల్లో రాణించేవారికి మంచి అవకాశమన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, నిరంతర సాధన చేసిన వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం అధ్యక్షులు నాగేశ్వర్ బాబు, చైర్మన్ ఆనందరావు, వ్యవస్థాపకులు నాగరత్నమయ్య పాల్గొన్నారు.

వ్యాధినిరోధక టీకాలపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని వడ్డేగేరి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాధాకృష్ణ టాకీస్ పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై డెమో శ్రీనివాసులు శనివారం అవగాహన కల్పించారు. అప్పుడే జన్మించిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్ల చిన్నారులకు టీకాలు తప్పకుండా వేయిస్తే వ్యాధినిరోధక శక్తి పెరిగి ఎలాంటి వైరస్‌లకు గురిగాకుండా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, సచివాలయ ఆరోగ్య కార్యకర్త సురేఖ, ఆశా కార్యకర్తలు రుబీనా, మాణిక్యమ్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ప్రగతికి మెట్టు

కర్నూలు న్యూసిటీ: సోలార్ విద్యుత్ ప్రగతికి సోపానమని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు పీయం ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కోసం ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించినట్లు శనివారం ఆయన తెలిపారు. జిల్లాలోని మూడు డివిజన్లలో దాదాపు 87 వేల ఎస్సీ, ఎస్టీ విద్యుత్ కనెక్షన్లు ఉంటాయన్నారు. ఒక్కో ఇంటికి 2 వాట్ల సోలార్ పలకల సిస్టమ్‌ను అమర్చేందుకు నమోదు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఎస్సీ, ఎస్టీల వినియోగదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అవగాహన కల్పిస్తూ ఫోన్ నంబర్, విద్యుత్ బిల్లు ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు వివరించారు. 2 వాట్ల సోలార్ పలకల సిస్టమ్ ఏర్పాటు ఖర్చు ఎవరు చెల్లిస్తారనే విషయమై ఉన్నతాధికారులు చర్చిస్తున్నారన్నారు.

సమష్టి కృషితోనే నగరాభివృద్ధి సాధ్యం

- మేయర్ బీవై రామయ్య



తీర్మానాలపై చర్చిస్తున్న మేయర్, కమిషనర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): పాలకులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తేనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో స్థాయీ సంఘ సమావేశంలో 8 తీర్మానాలను ప్రవేశపెట్టగా 6 ఆమోదం పొందాయి. మరో రెండు తీర్మానాలు వాయిదా పడ్డాయి. 23, 24, 12, 2వ వార్డుల్లో మురుగు కాల్వల నిర్మాణానికి రూ.1.47 కోట్లను కేటాయించారు. వివిధ ప్రాంతాల్లోని 3 పార్కింగ్ ప్రదేశాలను బహిరంగ వేలం పాట ద్వారా మూడేళ్ల పాటు లీజుకు కేటాయించేందుకు అంగీకరించారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎం.విక్రమసింహారెడ్డి, మిద్దె చిట్టమ్మ, యూనుస్, క్రాంతి కుమార్, జుబేర్, అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సీపీ ప్రదీప్ కుమార్, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం, రవాణా సౌకర్యం కల్పించాలి



ఏడీకి వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ తయారు చేసిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా సెలవు రోజుల్లో కూడా తరగతులు నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చారని, సెలవు రోజుల్లో తరగతులకు హాజరైయ్యే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు రవాణా సౌకర్యం కల్పించాలని కోరుతూ ఏపీటీఎఫ్ నాయకులు శనివారం డీఈఓ ఆఫీస్ ఏడీ కె.నాగభూషణంకు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం మాట్లాడుతూ సెలవు రోజుల్లో తరగతులకు హాజరైయ్యే విద్యార్థులకు భోజనంతో పాటు, రవాణా సౌకర్యం కల్పిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని, కానీ ఇంత వరకు అధికారులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదన్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు సౌకర్యాలను కల్పించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 22, 23 తేదీల్లో బుచ్చిరెడ్డి పాలెంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు సూచించారు. శనివారం పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలన్నారు. ఎంపికైన జట్టులో మృదు వల్లిక, రాజ్యలక్ష్మి, పుణ్యవతి, కవిత, సువర్ణ, ఇంద్రజ, గంగావతి, మౌనిక, శ్రీవాణి, నిత్యశ్రీ, చంద్రిక, రామతులసమ్మ ఉన్నారు.

రోగులకు అత్యవసర వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యవసర వైద్యం అందించేలా చూడాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం అయన ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఎమర్జెన్సీ విభాగం వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంఈ ఆదేశాల మేరకు ఆసుపత్రిలో అత్యవసర వైద్యసేవలను ఏర్పాటు చేసే ప్రోటోకాల్ ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర కేసులను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం కింద క్యాజువాలిటిలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ ఇక్బాల్ హుసేన్, డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ రుసుం వసులు



కమిషనర్ రవీంద్రబాబుకు వినతి పత్రమిస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: నగర పరిధిలోని గుత్తి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మున్సిపలిటీ అధికారులు ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలములో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ వాహనదారుల నుంచి రుసుం వసూలు చేస్తున్నారని 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, వ్యాపారస్తులతో కలసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబుకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కింగ్ దక్కించుకున్న గుత్తేదారు కర్నూలు నగరపాలక సంస్థ ఇచ్చిన షరతులను అతిక్రమిస్తున్నారన్నారు. స్కూటర్ స్టాండ్, కారు పార్కింగ్ మాత్రమే ఉపయోగించుకోవాల్సి ఉందని, అయితే గుత్తేదారుడు అదే స్థలంలో రేకుల కంటైనర్ వేసి హోటల్ నిర్వహిస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రులను గౌరవించడం నేర్వాలి



విజేతలతో మాంటిస్సోరి స్కూల్ హెచ్‌ఎం రమాజ్యోతి, తదితరులు

కర్నూలు సిటీ: ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులను గౌరవించడం నేర్పాలని మాంటిస్సోరి స్కూల్ హెచ్‌ఎం రమాజ్యోతి సూచించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాటల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నాలుగవ తరగతి విద్యార్థులు దేవరింటి నీల్‌గ్రీవ్ యాదవ్, డి.అభిరామ్‌రెడ్డి, ఎస్.శశాంక్ గ్రూప్ పాడిన 'నాన్నా నువ్వు నా ప్రాణం అనినా' పాట ఆకట్టుకుందన్నారు. చదువుతోపాటు విలువలతో కూడిన విద్యాబోధన తమ పాఠశాల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ బ్లాక్ కో-ఆర్డినేటర్ శ్రీజ్యోతి, పృథ్వీ, బ్లాక్ కో-ఆర్డినేటర్ హజ్రా, క్లాస్ టీచర్ నాగసులోచన పాల్గొన్నారు.

రోగుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో నమ్మకంతో వచ్చే రోగులకు విలువలతో కూడిన వైద్యం చేయాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. లెక్చర్ గ్యాలరీలో పోస్టు గ్రాడ్యుయేట్స్‌లకు ఎన్ఎంసీ నిబంధనల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కో ఆర్డినేటర్, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పీజీలకు గుడ్ క్లినికల్, లేబరేటరి ప్రాక్టీసెస్, ఎథిక్స్ గురించి కార్డియోథొరాసిక్ సర్జరీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు వైద్యులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ విష్ణు సహస్రనామ పారాయణం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ఆదివారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు అఖండ విష్ణు సహస్రనామ పారాయణ సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త తెలిపారు. మార్గ శిర బహుళ సప్తమి ఆదివారం ఉదయం 11.45 గంటలకు పారాయణం ప్రారంభమవుతుందన్నారు. పారాయణం పాల్గొనాలనుకునే వారు.. ఇతర వివరాలకు 81426 10313, 70757 04666 సంప్రదించ వచ్చని విజ్ఞప్తి చేశారు.

కుల వివక్షతను పారద్రోలాలి

కర్నూలు(సెంట్రల్):ఆదోని మండలం జి.హోసళ్లిలో కుల వివక్షతను పారద్రోలేందుకు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్య దర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జి.హోసళ్లిలో డిసెంబర్ 24, 25వ తేదీలలో జరిగే గ్రామ దేవర ఉత్సవంలో దళితులు బోనాలను చివరగా వెళ్లాలని గ్రామస్తులు హుకుం జారీ చేస్తున్నారని, ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీ గ్రామాన్ని సందర్శించి ప్రజలకు కుల వివక్షతపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు కృష్ణ, బతుకన్న పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించండి

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.రాజు కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్పతో కలిసి ఆయన విద్యుత్ భవన్‌లో ఎస్ఏఓ రాఘవులుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు కాంట్రాక్టర్లు రీడర్లకు వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. బిల్లులో కోతలు విధించే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ఇంటర్ విద్యా మండలికి 'నారాయణ' ప్రిన్సిపాళ్ల నామినేట్ అన్యాయం

కర్నూలు(సెంట్రల్): ఇంటర్మీడియెట్ విద్యా మండలి పునర్వవస్థీకరణలో భాగంగా నూతన మండలికి నారాయణ కళాశాల ప్రిన్సిపాళ్లను నామినేట్ చేయడం అన్యాయమని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే వారిని తొలగించాలని, లేకపోతే బోర్డును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే నారాయణ, చైతన్య కార్పొరేట్ కళాశాలల విజృంభణతో ఇంటర్ విద్యను నిర్వీర్యం చేశారని, ఈ పరిస్థితుల్లో నారాయణ కళాశాలల ప్రిన్సిపాళ్లకు విద్యా మండలిలో చోటు కల్పించడం సిగ్గుచేటన్నారు. దీనిపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు

కర్నూలు కల్చరల్: శ్రీసత్య సాయి బాబా యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో నెహ్రూ నగర్‌లోని శ్రీ సత్యసాయి కళాక్షేత్రంలో ఆదివారం నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సత్య సాయి సేవా ట్రస్ట్ కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ తెలిపారు. యోగా మాస్టర్ కటకం శ్రీనివాస కల్యాణ్ ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు గంట పాటు యోగా శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. అవకాశాన్ని సాయి సేవకులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



కేవీఆర్ కాలేజీలో రామానుజన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్వేపల్లి స్కూల్ హెచ్‌ఎం కేవీ అరుణశ్రీ

కర్నూలు సిటీ: నగరంలోని వివిధ స్కూల్స్, కాలేజీల్లో శనివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గణిత పోస్టర్లు, పజిల్స్‌ను ప్రదర్శించారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన గణిత దినోత్సవంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవి కారాణి, జూనియర్ కాలేజీ గణిత అధ్యాపకులు ప్రభుచరణ్ పాల్గొన్నారు.

- కేఎస్ఆర్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్లబ్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్, కర్నూలు మెల్విన్ జోన్స్ కార్యదర్శి గోపినాథ్ పాల్గొన్నారు.
- ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, గణిత విభాగాధిపతి ఎం.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సర్వేపల్లిలో..

కృష్ణానగర్‌లోని సర్వేపల్లి విద్యా సంస్థల్లో శనివారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్ర పటానికి స్కూల్ హెచ్‌ఎం కేవీ అరుణశ్రీ పూల మాల వేసి మైటీ మ్యాథ్స్ ఎస్‌పీవీఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తు కోసం తమ విద్యా సంస్థ ఏటా మేథో సంపత్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులను గణిత మేధావులను, గొప్ప శాస్త్రవేత్తలను తయారు చేయడమే తమ ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన మైటీ మ్యాథ్స్ ఎస్‌పీవీఎస్ వర్కింగ్ మోడల్స్‌ను తిలకించి విద్యార్థులను అభినందించారు.

వెయ్..చిందెయ్!

- ఘనంగా రవీంద్ర, శ్రీకృష్ణ కాలేజీల వార్షికోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యప్రదర్శన

కర్నూలు సిటీ: స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర, శ్రీకృష్ణ జూనియర్ కాలేజీల వార్షికోత్సవాలు శనివారం అలరించాయి. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు జి.పుల్లయ్య, విద్యా సంస్థల అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ జి.మమతమోహన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తును నిర్దేశించుకునే దశ ఇంటర్మీడియెట్ కీలకమైందన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని, వారు పడుతున్న కష్టాన్ని గుర్తించి ప్రతి విద్యార్థి బాధ్యతతో చదవాలన్నారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ అంశాలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో కాలేజీ కో-ఆర్డినేటర్ డి.సురేంద్రనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ వై.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భగవద్గీత పారాయణం



వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పత్రాలతో నాగమల్లీశ్వరి, అతిథులు

కర్నూలు కల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో సంగీత మాస్టర్ నాగమల్లేశ్వరి శిష్య బృందం చేత నిర్వహించిన భగవద్గీత సామూహిక పారాయణం వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైంది. శనివారం సంకల్ భాగ్‌లోని గీతా ప్రచార ధామంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డు వారి సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో 155 మంది విద్యార్థులు భగవద్గీతలోని ఒకటవ అధ్యాయం అర్జున విషాదయోగంలోని 1 నుంచి 47 శ్లోకాలు సామూహికంగా పారాయణం చేశారు. దీంతో శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం నిర్వాహకులు నాగమల్లీశ్వరికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు ఎల్.ఆర్.కృష్ణయ్య, కో ఆర్డినేటర్ లక్ష్మీగణపతిలు రికార్డు పత్రాన్ని అందజేశారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షులు డీవీ రమణ, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘుందన్ సేవక్ దాస్, తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఏపీఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీలో ముందస్తు క్రిస్మస్

కర్నూలు (అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డీడీ రామచంద్రరావు, ఎస్‌టీఓలు సునిల్ కుమార్, కరుణాకర్, అరవింద్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ విక్టర్ ఇమ్మానుయేల్ క్రిస్మస్ మాట్లాడుతూ మానవాళికి ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమన్నారు.